క్లుప్తంగా

మండల స్థాయి క్రికెట్ పోటీలు

అయిజ: క్రిస్మస్ పండుగ సందర్భంగా మండలంలోని ఉప్పలలో మండల స్థాయి క్రికెట్ పోటీలు (యూపీఎల్ 4 ప్రీమియర్ లీగ్) నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సతీష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22 నుంచి 28 వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు 6వ తేదీ లోపు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

దాడి చేసిన వారిపై చర్య తీసుకోవాలి

గద్వాల క్రైం: అకారణంగా దాడి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని బాధితులు బుధవారం జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. మల్దకల్ మండల కేంద్రానికి చెందిన కుమ్మరి బుచ్చన్న, ఆంజనేయులు, జమ్ములమ్మలపై కోడెదూడ విషయంలో కుమ్మరి కిష్టన్న చంద్రన్న, పరశరాముడు, పురుషోత్తం, విజయ్, శంకరమ్మ తమపై దాడికి పాల్పడ్డారని.. విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలలో చోరీకి యత్నం

గద్వాల క్రైం: ప్రభుత్వ పాఠశాలలో చోరీకి యత్నం చేసిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పాఠశాల హెచ్ఎం గణేష్ వివరాలు.. జమ్మిచెడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గుర్తు తెలియని దుండగులు పదో తరగతి గది తాళాలు పగులగొట్టి టీవీ ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నం చేశారు. ఈ సంఘటనపై రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. చోరీకి యత్నించిన దుండగులపై గుర్తించి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రాజేష్‌కుమార్



ఎర్రవల్లి: ఉమ్మడి ఇటిక్యాల మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పెద్దదిన్నె గ్రామానికి చెందిన రాజేష్‌కుమార్ బుధవారం ఎన్నికయ్యారు. యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో అధిక ఓట్లను కైవసం చేసుకోవడంతో మండల అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పదవిని అప్పగించిన కాంగ్రెస్ పార్టీకి, నాయకులకు, యువతకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అభివృద్ధితో పాటు ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

తాటికుంటలో వృద్ధుడి అదృశ్యం



గద్వాల(మల్దకల్) : మండలంలోని తాటికుంట గ్రామంలో వృద్ధుడు అదృశ్యమైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. తాటికుంట గ్రామానికి చెందిన జింకల ఎర్రన్న (68) ఐదు రోజుల క్రితం వ్యవసాయ పొలానికి వెళ్లిన ఇంటికి తిరిగి రాలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో బుధవారం మల్దకల్ పోలీసు స్టేషన్‌లో ఎర్రన్న కుమారుడు నరేష్ ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు 8712670295కు సమాచారం అందించాలని కోరారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

మానవపాడు: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గణితశాస్త్ర బోధనకు ఖాళీగా ఉన్న పోస్టును భర్తీ చేయడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఇంటర్మీడియెట్ జిల్లా అధికారి హృదయరాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో అభ్యర్థి 50శాతం ఉత్తీర్ణత కలిగి ఉండాలని, వ్యక్తిగత వివరాలు, ధ్రువపత్రాలతో కూడిన దరఖాస్తును శనివారం సాయంత్రం 4 గంటల వరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

కళాశాలకు ఆంప్లిఫైర్ వితరణ



అలంపూర్ : అలంపూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పూర్వపు విద్యార్థులు పోర్టబుల్ ఆంప్లిఫైర్ బుధవారం వితరణ చేశారు. 2011–13 సంవత్సర బ్యాచ్ విద్యార్థులు అందజేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో కళాశాలకు తమ వంతుగా సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జి.మహేష్, ఎస్. కిరణ్ కుమార్, ఆర్. నవీన్ కుమార్, బి. నాగేశ్వరరావు, ఎస్. అజయ్ కుమార్, బి. రామకృష్ణ, హెచ్. విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రత్యేక' పాలన అస్తవ్యస్తం

- సమస్యలతో సతమతమవుతున్న ప్రజలు
- తాగునీటి కోసం తంటాలు
- పట్టించుకోని ప్రత్యేక అధికారులు

మానవపాడు: గ్రామాల్లో పాలకవర్గాలు లేకపోవడం.. ప్రత్యేక అధికారులు పట్టించుకోకపోవడంతో చాలా సమస్యలు తిష్టవేశాయి. పరిసరాల అపరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, బోర్ల మరమ్మతులు, రోడ్లపై ఏర్పడిన గుంతలు తదితర సమస్యలతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

లోపించిన పారిశుద్ధ్యం...

మండలంలోని 17 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రత్యేక అధికారుల పాలన నడుస్తోంది. అధికారులు ఎప్పుడు వస్తారో... ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి నెలకొంది. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఉన్నా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. చెత్త ట్రాక్టర్లు నిరుపయోగంగా మారాయి. ఇళ్ల మధ్యలో చెత్త పేరుకుపోవడం, అపరిశుభ్ర తాగునీరు, కనీసం బ్లీచింగ్ చేసే వారే కరువయ్యారని పేర్కొన్నారు. అనారోగ్యం బారిన పడి ఆరోగ్య కేంద్రాల చుట్టూ



జల్లాపురంలో బోరింగ్ వద్ద గ్రామస్తులు

ప్రజలు తిరుగుతున్నారు.

పట్టించుకోని అధికారులు..

పంచాయతీల ప్రత్యేకధికారులు తమ సొంత శాఖల బాధ్యతతో పాటు గ్రామాల పర్యవేక్షణ ఉండటంతో కొందరు అధికారులు బాధ్యతతో పనిచేస్తుండగా... మరికొందరు గ్రామాల వైపు కన్నెత్తి చూడటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.



గోకులపాడులో నిరుపయోగంగా చెత్త ట్రాక్టర్

గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై పంచాయతీ కార్యదర్శులకు, మండల స్థాయి అధికారులకు తెలిపిన నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

గ్రామాల్లో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బోర్ మరమ్మతు చేయండి..

గోకులపాడులో బోరు పాడైందని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. పశువులకు, నిత్యావసరాలకు బోర్ నీళ్లు ఉపయోగపడతాయి. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

- విజయ్‌కుమార్, గోకులపాడు

పడకేసిన పారిశుద్ధ్యం..

మండలంలోని ఆయా గ్రామాల్లో ఎక్కడ చూసిన చెత్త పేరుకుపోయింది. అధికారులు వస్తున్నారంటేనే శుభ్రం చేస్తున్నారు. డ్రైనేజీల వద్ద బ్లీచింగ్ చేయించాలి. గ్రామాల్లో ప్రత్యేక అధికారులు పర్యవేక్షణ ఉండాలి.

- రవి, మానవపాడు

తక్షణ చర్యలు చేపడుతాం..

గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపడుతాం. బోర్ల మర్మతులు, వీధుల వెంట బ్లీచింగ్ చేయిస్తాం. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాం. గ్రామాల్లో ప్రత్యేక అధికారులపై ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్తాం

- భాస్కర్ ఎంపీడీఓ, మానవపాడు

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

ఇటిక్యాల/ ఎర్రవల్లి : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ డైరెక్టర్ రంగారెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మెన్ నీలి శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండల పరిధిలోని మునుగాల గ్రామంలో పుటాన్‌దొడ్డి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. 17శాతం తేమ ఉండేలా వడ్లను రైతులు కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలన్నారు. ముఖ్యంగా వడ్లల్లో తాలు, రాళ్లు, మట్టి పెల్లలు లేకుండా తీసుకువచ్చి అధికారులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, చంద్రాస్‌రెడ్డి, సూర్యకాంతరెడ్డి, మధుకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, రాజు, సుధాకార్ రెడ్డి,శంకర్ రెడ్డి, ఎల్లారెడ్డి, ఏఓ రవికుమార్, ఏఈఓ ప్రవళిక, పీఏసీఎస్ సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

శాంతినగర్‌లో..



మునుగాలలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

శాంతినగర్ : వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పైపాడులో వరి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం అధికారులు ప్రారంభించారు. సన్న రకం వరి ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ యార్డు అధికారులు సూచించారు.

ఆరు గ్యారంటీలపై కళాజాతా

గద్వాల(ధరూరు): కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలపై బుధవారం మండల పరిధిలోని కోతులగిద్ద, చింతరేవుల, అల్వలపాడు తదితర గ్రామాల్లో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు అవగాహన కల్పించారు. ప్రభుత్వం ఏడాది కాలంలో అమలు చేసిన ఆరు గ్యారంటీల అమలుపై 19 రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజా విజయోత్సవాలు నిర్వహిస్తోందన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఇందిరా మహిళా శక్తి, 50వేల ఉద్యోగాలు, రైతు రుణమాఫీ, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు



చింతరేవులలో ఆరు గ్యారెంటీలపై వివరిస్తున్న కళాకారులు

తదితర పథకాల గురించి పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాకారులు భూపతి రమాదేవి, హజ్రత్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలు విజయవంతం చేయాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న యూఎస్ఎఫ్ఐ నాయకులు

అయిజ: భారత ఐక్య విద్యార్థి సమైక్య ఆల్ ఇండియా మహాసభలను విజయవంతం చేయాలని యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యూఎస్ఎఫ్ఐ నాయకులు మహాసభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. ఈ నెల 14, 15 తేదీల్లో ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభల్లో దేశ వ్యాప్తంగా విద్యా రంగంలో వస్తున్న మార్పులను చర్చించి భవిష్యత్ ఉద్యమాల కార్యచరణను రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగస్వామి, రవి, రాజు, నరేష్, గోపాల్, ప్రవీణ్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిశిలా క్షేత్రంలో మహాహోమం

గద్వాల(మల్దకల్) : ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం వేదపండితులు మహా హోమం నిర్వహించారు. రెండో రోజు స్వామి వారి కల్యాణ మండపంలో వేదపండితులు రమేషాచారి, రవిచారి, మధుసూదనాచారి, రవిచారి, దీరేంద్రదాసుల ఆధ్వర్యంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. గురువారం ప్రతిష్ఠించనున్న ధ్వజస్తంభ కార్యక్రమానికి మంత్రాలయ పీఠాధిపతి హాజరుకానున్నట్లు ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సత్యచంద్రారెడ్డి,



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

నిర్వాహకులు అరవిందరావు, చంద్రశేఖర్‌రావు, నాగరాజు శర్మ, మధుసూదన్‌రెడ్డి, సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులను విస్మరించొద్దు

వనపర్తి టౌన్: ఏళ్ల తరబడి ఆటోలను నడుపుతూ జీవనం సాగిస్తున్న ఆటో కార్మికులను ప్రభుత్వం విస్మరించొద్దని నూతనంగా ఎన్నికైన ఆటో యూనియన్ అధ్యక్షుడు తాత రాములు, ప్రధాన కార్యదర్శి జె.వెంకటరమణ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఆటో యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా గట్టుయాదవ్, పలుస రమేష్‌గౌడ్, నందిమల్ల అశోక్, ప్రేమ్‌నాథ్ రెడ్డి, గంధం పరంజ్యోతి, తిరుమల్, అధ్యక్షుడిగా తాతా రాములు, ప్రధాన కార్యదర్శిగా జె.వెంకటరమణ, కోశాధికారిగా వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా ఎండా పాషా, బి.శ్రీనివాసులు, రఫియోద్దీన్, శివాజీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆటో కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.

అయ్యప్ప స్వామికి అభిషేకం



ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామికి భక్తులు పంచామృతాభిషేకం, పడిపూజ నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేవారు. కార్యక్రమంలో అర్చకులు ఆంజనేయ శర్మ, ఆలయ ధర్మకర్త దామోదర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం..బురదమయం



ఉండవెల్లి: మండలంలోని తక్కశీల గ్రామంలోని రహదారి గుంతల మయంగా మారి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు పూర్తిగా దెబ్బతింది. రోడ్డుపై ప్రయాణించాలంటేనే వాహనదారులు భయపడుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి నూతన రోడ్డు నిర్మించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ఆటో బోల్తా.. ముగ్గురికి గాయాలు



మల్దకల్: ఆటోలో అంత్యక్రియలకు వెళ్లి వస్తున్న క్రమంలో ఎడ్ల బండి అడ్డురావడంతో ఆటో అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన బుధవారం మండలంలోని మంగంపేట స్టేజీ సమీపంలో చోటు చేసుకుంది. వివరాలు.. నారాయణపేట జిల్లా మక్తల్ మండలం మంతన్‌గోడు గ్రామానికి చెందిన శంకరప్ప, ఉమాదేవి, ఈశ్వరమ్మ వడ్డెపల్లి మండలంలోని తనగల గ్రామానికి అంత్యక్రియలకు వెళ్లి వస్తుండగా మార్గమధ్యలో మంగంపేట స్టేజీ దగ్గర ఎడ్ల బండి అడ్డురావడంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఆటో ప్రయాణిస్తున్న వారిలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను గద్వాల ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ గోపాల్‌నాయక్ తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై ఫిర్యాదు

పాన్‌గల్: ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ డ్రైవర్‌పై ఫిర్యాదు చేసిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. వీపనగండ్ల మండలం కల్వరాల గ్రామానికి చెందిన వంగ సుమిత్రమ్మ గత నెల 28వ తేదీన కొల్లాపూర్ నుంచి వనపర్తి వెళ్తున్న కొల్లాపూర్ డిపో బస్సులో కొల్లాపూర్‌లో బస్సు ఎక్కింది. ఆమె మండలంలోని కేతేపల్లిలో బస్సు దిగుతుండగా డ్రైవర్ సలేశ్వరం అజాగ్రత్తగా, అతివేగంగా బస్సును నడపడటంతో ఆమె కిందపడి రెండు కాళ్లకు రక్తగాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ డ్రైవర్‌పై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధిత మహిళ అల్లుడు రసాల యుగేంధర్‌గౌడు బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పశువులకు సరైన పోషణ అందించాలి

అలంపూర్ : పాడి రైతులు పశువులకు సరైన పోషణ అందించాలని పశు వైద్య, సంవర్ధక శాఖ జిల్లా నోడల్ అధికారి వెంకటనారయణ అన్నారు. అలంపూర్ మండలం భీమవరం గ్రామంలో పశు వైద్య– పశు సంవర్ధక శాఖ అధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు గర్భకోశ వ్యాధి, గాలికుంట వ్యాధి నివారణకు చికిత్స అందించారు. అనంతరం రాయితీపై గడ్డి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా నోడల్ అధికారి మాట్లాడుతూ...గ్రామాల్లో వ్యవసాయం అభివృద్ధి చెందాలంటే పశు సంపద ఉంటేనే సాధ్యమన్నారు. పాల దిగుబడి పెంపునకు పశువులకు పోషక ఆహారం అందించాలన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ శంకరయ్య, ఉండవెల్లి పశువైద్యాధికారి డాక్టర్ శిరీష , వెటర్నరీ అసిస్టెంట్ శాంతి, యుగేంధర్, గోపాలమిత్ర సూపర్‌వైజర్ సుర్యారెడ్డి, సిబ్బంది ప్రకాష్, గోపాల మిత్రలు చిన్న స్వాములు, ప్రసాద్ గౌడ్, మల్లేష్, లోకేష్, గ్రామ పాడి రైతులు పాల్గొన్నారు.



భీమవరంలో రాయితీపై విత్తనాలు అందజేస్తున్న పశువైద్య అధికారులు

ఆలయాల అభివృద్ధికి నిరంతరం కృషి

అలంపూర్: ఆలయాల అభివృద్ధికి పాలక మండలి నిరంతరం కృషి చేస్తోందని ఆలయ కమిటీ చైర్మన్ కొంకల నాగేశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలో ఆలయ సముదాయంలో నిర్వహించిన పాలక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది టెండర్ల ద్వారా రూ.1.80 కోటి ఆదాయం వచ్చిందన్నారు. కానీ ఈ ఏడాది అదే టెండర్ల ద్వార రూ.3.48 కోట్ల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. క్షేత్రానికి వచ్చే సాధారణ భక్తులు బస చేయడానికి సత్రం, లాకర్లు ఏర్పాటు చేస్తామన్నారు. అదే విధంగా ఆలయ ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మ సంఘటన స్పందించారు. పక్క రాష్ట్రమైన ఏపీలో జరిగిందని అది ఆయన వ్యక్తిగత జీవితానికి సంబంధించినదిగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు నాగశిరోమణి, సరస్వతి, పులేందర్, వెంకటేశ్వర్లు, జగన్ గౌడ్, జగన్‌మోహననాయుడు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి

బ్యాంక్ సేవలు వినియోగించుకోవాలి

రాజోళి: బ్యాంక్ సేవలను ప్రజలు వినియోగించుకుని అభివృద్ధి చెందాలని ఏపీజీవీబీ బ్యాంక్ మాన్‌దొడ్డి బ్రాంచ్ మేనేజర్ రాంకుమార్ భూక్యా అన్నారు. మండలంలోని మాన్‌దొడ్డిలో బుధవారం బ్యాంక సేవలపై జన సురక్ష అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సదర్భంగా వారు మాట్లాడుతూ...బ్యాంకుల ద్వారా అందుబాటులో ఉన్న పలు పథకాలతో విద్యా, ఉపాధి అవకాశాలకు తోడ్పాడుగా ఉండటమే కాకుండా ఇన్సూరెన్స్ సౌకర్యం ఉందన్నారు. ఈ సందర్భంగా ఇటీవల మృతి చెందిన చాకలి మాదన్న కుటుంబానికి ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన ద్వారా రూ. 2 లక్షల ఇన్సూరెన్స్ చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందచేశారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మృతుడి కుటుంబ సభ్యులకు చెక్కు అందచేస్తున్న మేనేజర్ రాంకుమార్ భూక్యా

విద్యార్థులతో చెలగాటమాడుతున్న ప్రభుత్వం

ఉండవెల్లి: గురుకుల పాఠశాల విద్యార్థులతో ప్రభుత్వం చెలగాట మాడుతుందని జిల్లా బీఆర్ఎస్వీ కోఆర్డినేటర్ పల్లయ్య అన్నారు. మండలంలోని మైనార్టీ గురుకుల పాఠశాల, మండల కేంద్రంలోని ఎస్సీ హస్టల్, పుల్లూరు గురుకుల బాలుర, బాలికల పాఠశాల, కలుగోట్ల కేజీబీవీని బుధవారం పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే గురుకుల పాఠశాలల్లో చాలా మందికి ఫుడ్ పాయిజన్ జరిగిందని, ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. బీఆర్ఎస్ పాలనలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గురుకులాల్లో పురుగుల అన్నం పెడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు గద్దం భరత్ భాబు, మత్తలి, వీరేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.



ఉండవెల్లి మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న నాయకులు

ప్రభుత్వం పరువు హత్యలు అడ్డుకోవాలి

గద్వాల(గట్టు) : పరువు హత్యలను ప్రభుత్వం అడ్డుకోవాలని కేవీపీఎస్ నాయకులు అన్నారు. బుధవారం గట్టులో ప్రతిఘటన పోస్టర్ వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కర్రెప్ప మాట్లాడుతూ.. పరువు హత్యకు పాల్పడిన పరమేష్ అనే వ్యక్తిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కానిస్టేబుల్ నాగమణి హత్య చేసిన హంతకులను కఠినంగా శిక్షించాలని కోరారు. పరువు హత్యలు పునరావృతం కాకుండా అవగాహన కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు గోపాల్, ఆదాం, నర్సింహులు, తిమ్మప్ప, ఏసు, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ విడుదల చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

గిట్టుబాటు ధర కల్పించాలి

ఇటిక్యాల : ఆరుగాలం శ్రమించి కష్టపడి వరిని పండించిన రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు అన్నారు. బుధవారం మండల పరిధిలోని మొగలిరావులచెరువు గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ధాన్యంలో తేమ ఎక్కువగా ఉందని కొనుగోలు చేయడం లేదని రైతు పేర్కొన్నట్లు తెలిపారు. ప్రభుత్వం రైతులపై ఉదారంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రవి, మోజేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న బీఎస్పీ నాయకులు

నాణ్యమైన భోజనం అందించాలి

గద్వాల(ధరూరు) : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓ రవీంద్రబాబు అన్నారు. మార్లబీడులోని కస్తూర్బా గాంధీ పాఠశాల, ధరూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, మార్లబీడు బీసీ బాలుర గురుకుల పాఠశాలలను బుధవారం ఆయన సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. భోజన నాణ్యతలో రాజీపడకూడదన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ బతుకన్న పాల్గొన్నారు.



ధరూరు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ రవీంద్రబాబు

డీలర్లు నిబంధనలు పాటించాలి

అయిజ: రేషన్ డీలర్లు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని తహసీల్దార్ జ్యోతి అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. డీలర్లు ఆపరేషన్ రెన్యూవల్ చేయించుకోవాలని, సకాలంలో లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయాలన్నారు. నేమ్ బోర్డ్, స్టాక్ వివరాలు నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ రజనీకాంత్‌రెడ్డి, వివిధ గ్రామాల రేషన్ డీలర్లు పాల్గొన్నారు.



డీలర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ జ్యోతి